క్లుప్తంగా

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్



చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఐరాల: మండలంలోని పేరయ్యగారిపల్లె, మొరంపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మొరంపల్లెలో 60 మందికి, డాక్టర్ పూర్ణలత పేరయ్యగారిపల్లెలో 65 మందికి వేర్వేరుగా వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

స్టోర్‌లో అగ్నిప్రమాదం

చిత్తూరు కార్పొరేషన్: గుర్తు తెలియని వ్యక్తులు టపాసులు కాల్చడంతో ట్రాన్స్‌కో జిల్లా స్టోర్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. టపాసులు కేబుల్స్ మీద పడడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. సంఘటనా స్థలాన్ని శనివారం పీఅండ్ఎం సీజీఎం చలపతి, ఎస్ఈ కృష్ణారెడ్డి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు టపాసులు కాల్చడంతో సంఘటన జరిగిందన్నారు. దాదాపు రూ.15 లక్షల వరకు నష్టం జరిగినట్లు నివేదిక తయారు చేశామన్నారు.

గో సంరక్షణకు విరాళం



విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు ఓ దాత నగదు విరాళం చేశారు. వైఎస్సార్ కడపజిల్లా పులివెందులకు చెందిన బాలాజీ అనే దాత రూ.1,00,116 నగదును ఆలయ అధికారులకు అందజేశారు. ముందుగా ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో అధికారులు కోదండపాణి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.16.5 లక్షల నగదు పట్టివేత

పలమనేరు: పట్టణ సమీపంలోని గంటావూరు ఫ్లై ఓవర్ వద్ద స్థానిక పోలీసులు, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఓ కారులో రూ.16.5 లక్షల నగదును పట్టుకున్నారు. దీనిపై విచారించగా తాను పట్టణానికే చెందిన వ్యాపారి అని ఆ డబ్బుకు సంబంధించిన బిల్లులు, తన ఆధార్, డబ్బులిచ్చిన వారి రసీదులను చూపెట్టాడు. అన్నీ సక్రమంగానే ఉండడంతో ఆ నగదును వెనక్కిచ్చేసినట్టు డీటీ రుషి, ఎస్ఐ సహదేవి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామకుప్పం: అక్రమంగా రవాణా చేస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. ఆరిమానుపెంట గ్రామానికి చెందిన లోకేష్ ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తీసుకెళ్తుండగా ఆరిమానుపెంట గ్రామ సమీపంలో అతని నుంచి 358 టెట్రా ప్యాకెట్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని అతని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.35 వేలు ఉంటుందని ఎస్ఐ అన్నారు.

పారదర్శక పాలనకు పట్టం కట్టండి

- ఎంసీ విజయానందరెడ్డి



సంతపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ పారదర్శక పాలన చేస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని చిత్తూరులో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ చిత్తూరు అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. శనివారం సంతపేట దర్గా నుంచి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్ల పాలనలో ఎలాంటి అవినీతి లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందించారన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని, అలాగే సంక్షేమ పథకాలు అర్హులకు అందిందన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. ప్రజలు గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించి ఓటు వేయాలని కోరారు. మరోసారి సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని కోరారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో వచ్చినట్లు ఆయన చెప్పారు. పదవి లేకుండానే తన వంతుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. పదవి వస్తే మరింత మందికి మంచి చేయవచ్చని, అందుకు ప్రజలంతా తనను ఆశీర్వదించాలని కోరారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారిని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, కార్పొరేటర్ శారద, నాయకులు రెడ్డప్ప, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌విందు..

స్థానిక 49వ డివిజన్ కార్పొరేటర్, నగర పార్టీ అధ్యక్షుడు జ్ఞానజగదీష్ ఆధ్వర్యంలో తన కార్యాలయ ఆవరణలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు ఆనందంగా కుటుంబంతో కలిసి రంజాన్ పండుగను జరుపుకోవాలని చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీకి మైనార్టీలు అందిస్తున్న సహకారం మరువలేనిదని, వారి ఆదరణను ఓట్ల రూపంలో చూపించి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఆను తదితరులు పాల్గొన్నారు.





ఇఫ్తార్‌విందులో పాల్గొన్న విజయానందరెడ్డి, జ్ఞానజగదీష్, గుడిపాల: అమ్మవారి సేవలో..

అమ్మవారికి పూజలు

గుడిపాల: అమ్మవారి అనుగ్రహంతో ప్రతిఒక్కరూ బాగుండాలని చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి అన్నారు. శనివారం గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లె గ్రామస్తులు గుడిపాలలో ఉన్న ధర్మరాజుల ద్రౌపది అమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో విజయానందరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులు ద్రౌపదిదేవి, అర్జున, భీముడు, నకుల, సహదేవుల విగ్రహాలకు పూజలు చేసి మహిళలు అధికసంఖ్యలో పొంగళ్లు పెట్టి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ప్రదీప్‌రెడ్డి, జానకిరామిరెడ్డి, కారిమేగన్, సంపత్, పెరిల్లా, రమ్యతో పాటు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వలంటీర్లంటే భయమెందుకు బాబు ?

చిత్తూరు రూరల్: వలంటీర్లు అంటే భయమెందుకు బాబు అంటూ పలువురు వలంటీర్లు ప్రశ్నలవర్షం కురిపించారు. చిత్తూరు మండలంలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. శనివారం కూడా 15 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఇందులో చింతలగుంట నుంచి 13 మంది, చెర్లోపల్లి నుంచి ఇద్దరు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డికి అందజేశారు. పలువురు మాట్లాడుతూ వలంటీర్లంటే చంద్రబాబునాయుడికి వణుకు పుట్టుకుందన్నారు. ముఖ్యంగా ఓటమి భయంతో వలంటీర్లపై కక్ష కట్టారన్నారు. ఇంటింటికి వెళ్లి సేవ చేస్తే అది గిట్టక మమ్మల్ని తరుముకొస్తున్నారని తెలిపారు. అవ్వాతాతలకు పింఛన్లు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వద్ద ఉన్న మొబైల్ ఫోన్లను సైతం లాగేసుకునేలా చేశారన్నారు. అలాంటప్పుడు ఈ పని తమకొద్దని స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్లు చెప్పారు. ఇంటింటికీ పింఛన్లు అందక పలుచోట్ల వృద్ధులు మృత్యువాత పడ్డారు. కనికరం లేని బాబుకు ఓట్లు పేదలు, వృద్ధులు లెక్కల్లో లేదని చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో తమ తడక ఏంటో చూపిస్తామని సవాల్ విసిరారు. తాము ఎప్పటికీ బాబు కుట్రలకు తాము భయపడేదని లేదని తేల్చి చెప్పారు.



రాజీనామాపత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

కారు, డీజిల్ ట్యాంకర్ ఢీ

- దంపతులకు తీవ్రగాయాలు

గంగవరం: కారు, డీజిల్ ట్యాంకర్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గంగవరం మండలంలో శనివారం జరిగింది. గంటావూరు బీసీ కాలనీకి చెందిన సర్ఫొద్దీన్(54) ట్యాక్సీ డ్రైవర్. ఇతని భార్య సాజియాభాను(37). వీరిద్దరు శనివారం మదనపల్లిలోని ఆస్పత్రికి కారులో బయలుదేరారు. చికిత్స తీసుకుని మదనపల్లె నుంచి తిరిగి వెళుతుండగా కల్లుపల్లి బైపాస్ రోడ్డులో నూతన గ్రామ సచివాలయం వద్ద ఎదురుగా వస్తున్న డీజిల్ ట్యాంకర్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న భార్యాభర్త ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. స్థానికుల సమాచారం మేరకు గంగవరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్‌కు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటుతోనే బంగారు భవిష్యత్



కుక్కలపల్లెలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

చిత్తూరు అర్బన్: ప్రతీ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చని చిత్తూరు మున్సిపల్ కార్పొరేష్ అధికారులు స్పష్టం చేశారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు నగర పరిధిలోని కుక్కలపల్లెలో భారతం జరుగుతున్న ప్రాంతంతో మహిళలకు స్వీప్‌పై అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రాధాన్యత, ఎథికల్ ఓటింగ్, ఈవీఎంల వినియోగంపై వివరించారు. కుటుంబ ప్రగతిలో మహిళల పాత్ర కీలకమని.. దేశ ప్రగతిలో మహిళల ఓట్లే ప్రధానమన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం దొడ్డిపల్లె ఉన్నత పాఠశాల, మురకంబట్టు ప్రాంతాల్లో జానపద పాటలు, పద్యాల ద్వారా ఓటరు చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రజారోగ్యశాఖ అధికారి చిన్నయ్య పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ వేడుకలు



జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: భారతీయ జనతా పార్టీ 44వ ఆవిర్భావ వేడుకలను జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ జెండాను జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వెళ్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రామభద్ర, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు



ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానందరెడ్డిపై వ్యక్తిగత విమర్శలు
- వన్‌టౌన్ పోలీసులకు వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు

చిత్తూరు అర్బన్: టీడీపీ చిత్తూరు అభ్యర్థికి ప్రజాక్షేత్రంలో బలం, మద్దతు లేకపోవడంతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. శనివారం రాత్రి వారు చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ సోషల్ మీడియాలో వస్తున్న అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను జీర్ణించుకోలేక టీడీపీ వారు పెయిడ్ పోస్టులతో తమ అక్కసును వెళ్లగక్కుతున్నారని ఆరోపించారు. ఈ పోస్టులు స్వయానా తెదేపా అభ్యర్థికి చెందిన ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ అకౌంట్‌లో అసభ్యంగా, వ్యక్తిగతంగా కించపరిచేలా చేస్తున్నారని తెలిపారు. అతనితో పాటు ఆ పార్టీకి చెందిన కొంతమంది పెయిడ్ కార్యకర్తలతో తమ స్థాయికి తగ్గట్టు కాకుండా అత్యంత దిగజారి పోస్టులు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అంతే కాకుండా వారు తమ పేర్ల పక్కన ఇంటి పేర్లను, కులాలను మార్చి పోస్టలను పెడుతూ తమ కుటిల బుద్ధిని చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పోస్టులు రాజకీయంగా తమ పార్టీ కార్యకర్తలను, ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని తెలిపారు. ఇలాంటి నీతిమాలిన చర్యలకు పాల్పడిన తెదేపా అభ్యర్థితో పాటు అతని పెయిడ్‌కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు గాయత్రీ దేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి, నాయకులు బాబీ, లీగల్ సెల్ అడ్వొకేట్ సూరి, కార్పొరేటర్ మధు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటప్రసాద్

బంగారుపాళెం: రోగులకు సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక వైద్యవిధాన పరిషత్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రి ఆవరణలోని ఐసీటీసీ కేంద్రం, క్షయనివారణ కేంద్రాల్లో పలు రికార్డులను పరిశీలించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. రోగులతో సిబ్బంది ప్రేమగా మెలగాలని సూచించారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీషకు సూచించారు. డీపీఎంఓ మణి, శివకుమార్, ప్రకాష్, ఐసీటీసీ కౌన్సిలర్ బాబు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఆవరణలో హోర్డింగ్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటప్రసాద్

ఎస్‌పీఎం పనులు పూర్తి చేయండి

చిత్తూరు కార్పొరేషన్: త్వరగా ఎస్‌పీఎం (ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రం) పనులు పూర్తి చేయాలని ట్రాన్స్‌కో పీఅండ్ఎం సీజీఎం చలపతి తెలిపారు. శనివారం చిత్తూరులోని కేంద్రాన్ని పరిశీలించారు. దాదాపు పనుల పూర్తయిందని ఇక తుదిదశలో ఉన్న ప్రహరీగోడ, ఫ్లోర్ నిర్మాణం పనులు చేయాల్సి ఉందని డీఈ ఆనంద్ తెలిపారు. ఈనెలలోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ భవనం మోడల్‌తోనే పులివెందులలో ఎస్‌పీఎంను నిర్మిస్తున్నట్లు చెప్పారు. సకాలంలో విద్యుత్ పరికరాలు తెప్పిస్తున్నామని తెలిపారు. అవసరమైన మెటీరియల్స్ స్టాక్ ఉందన్నారు. వేసవి కాలంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో జీఎం జానకీరామ్, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌పీఎం భవనాన్ని పరిశీలిస్తున్న సీజీఎం చలపతి

వసతులు లేకుంటే మీదే బాధ్యత

గంగాధరనెల్లూరు: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పన లేకపోతే సెక్టోరల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ అన్నారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సెక్టోరల్ అధికారులతో రిటర్నింగ్ అధికారి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టోరల్ అధికారులుగా నియమించబడిన వారంతా ఆయా డిపార్టుమెంట్ శాఖల పనులు పక్కన పెట్టేసి, వారికి కేటాయించిన ఎన్నికల బాధ్యతలను అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీటి వసతి, వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంపులను టాయిలెట్లు సౌకర్యం సక్రమంగా? ఉందా లేదా ? చూసుకోవాలన్నారు. ఏదైనా పెండింగ్‌లో ఉంటే ఆయా మండలాల సెక్టోరల్ అధికారులు చురుగ్గా ఉండి పనులు విజయవంతంగా పూర్తి చేస్తే వారి సహకారమే తనకు కొండంత బలమని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రవి, డీటీ తులసిరామ్, ఎన్నికల డీటీ విజయ్‌కృష్ణ, ఏఎస్ఓ ఆనంద్ మోహన్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ

ఉపాధి హామీ పనుల తనిఖీ



టి.పుత్తూరులో సరిహద్దు కందకాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

తవణంపల్లె: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులను శనివారం సీఆర్‌డీ స్పెషల్ క్వాలిటీ కంట్రోల్ టీం సభ్యులు బి. శ్రీనివాసులు, డ్వామా పీడీ ఎన్, రాజశేఖర్, ఏపీడీ సుబ్రమణ్యం తనిఖీ చేశారు. టి.పుత్తూరు, దిగువ తడకర పంచాయతీల్లో జరిగిన, జరుగుతున్న పనులను పరిశీలించారు. టి.పుత్తూరు పంచాయతీలో చేసిన పనులను మళ్లీ మళ్లీ ఎందుకు చేస్తున్నారని మండల ఈజీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా దిగువ తడకరలో జరుగుతున్న పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మా పంచాయతీలో కుంటలు, చెరువులు లేకపోవడంతో ఫారెస్టులో పనులు కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. కూలీలకు వేతనాలు త్వరగా మంజూరుచేయాలని కోరారు. దీనిపై ఫారెస్టు అధికారులతో మాట్లాడి ఉపాధి పనులు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామని డ్వామా పీడీ రాజశేఖర్ కూలీలకు హామీ ఇచ్చారు. టి.పుత్తూరులో కాలువ పూడికతీత పనులు, మామిడి మొక్కల పెంపకం, సరిహద్దు కందకాలు పనులను, దిగువ తడకరలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను, మామిడి మొక్కల పెంపకం పనులను పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఏపీఓ లలిత, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరమణారెడ్డి, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



దిగువ తడకరలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

ఇంటి ముంగిటకే ఫ్యామిలీ డాక్టర్

- గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు
- మంచానపడ్డ రోగులకు వైద్యం
- హర్షిస్తున్న ప్రజానీకం



టి.పుత్తూరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు

తవణంపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్యరంగానికి పెద్దపీట వేశారు. గ్రామీణ నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్య సేవలందించాలన్న సంకల్పంతో వైద్యరంగంలో పలు విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. పల్లెల్లోని పేదలకు మరింత చేరువగా వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడాలేని విధంగా ఫ్యామిలీ డాక్టర్ అమల్లోకి తెచ్చారు. గ్రామాల్లో పేదలు వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక సమస్యలతో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు. అదేవిధంగా గ్రామీణ పేదలకు కార్పొరేట్ వైద్య సేవలందించడానికి ప్రతిఒక్కరికి వైద్యపరీక్షలు చేయాలనే ఉద్దేశంలో జగనన్న ఆరోగ్య సురక్ష-1, జగనన్న ఆరోగ్యసురక్ష-2 కార్యక్రమాలు చేసి రోగులకు వైద్యపరీక్షలు చేయించారు. జబ్బులను గుర్తించి కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫరల్ చేయడంతో మెరుగైన వైద్యం చేయించుకొని ఆరోగ్యవంతులుగా ఉన్నారు. మండలంలో 16 హెల్త్ విలేజ్ క్లినిక్ సెంటర్లు ఉన్నాయి. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. మండలంలో ముగ్గురు వైద్యులు, సీహెచ్ఓ, పీహెచ్ఎన్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పనిచేస్తున్నారు. మండలంలో 104 మొబైల్ క్లినిక్ వాహనం ద్వారా వైద్య బృందం ప్రతిరోజూ ఒక గ్రామానికి వెళ్లి పేదలకు వైద్య సేవలందిస్తున్నారు. రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు.

గుడిపాలలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఇంటి వద్దే నాణ్యమైన వైద్యం అందుతోందని గుడిపాల పీహెచ్‌సీ డాక్టర్ చంద్రమహేష్ అన్నారు. బసవాపల్లె గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రోసిలిన్, చంద్ర, కోమల, పంకజ, నిత్య పాల్గొన్నారు.



గుడిపాలలో..

మా ఊరికే డాక్టర్లు వస్తున్నారు..



నేను వైద్యం చేయించుకోవాలంటే తవణంపల్లె పీహెచ్‌సీకి వెళ్లాలి. నా మనవడు జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మా ఊరికే వైద్యులు వస్తున్నారు. నా కాళ్ల నొప్పులకు మాత్రలు ఇస్తున్నారు. వైద్యం కోసం బయటకు వెళ్లే కష్టం తీరింది. జగన్‌కు రుణపడి ఉంటాను.

–గోవిందమ్మ, టి.పుత్తూరు

డాక్టర్లు పరీక్షలు చేస్తున్నారు..



మా ఊరికి నెలకొకసారి డాక్టర్లు వస్తారు. బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. మందులు, మాత్రలు ఇస్తారు. డాక్టర్లు మా ఊరికి వచ్చి వైద్యం చేయడం సంతోషంగా ఉంది. జగన్ వల్లే నడవలేని వారందరికీ ఇంటికి వచ్చి వైద్యం చేస్తున్నారు. –యశోదమ్మ, టి.పుత్తూరు

ప్రతి నెలా పరీక్షలు చేసుకుంటున్నా..



నేను డాక్టర్ దగ్గరకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతుండే వాడని. ఇప్పుడు డాక్టర్లు మా ఊరికి వచ్చి వైద్యం చేస్తున్నారు. కావలసిన మాత్రలు ఇస్తున్నారు. సీఎం జగన్ వల్ల బయటకు వెళ్లే అవసరం లేకుండా వైద్యం చేయించుకొంటున్నా. –లోకనాథరెడ్డి, టి.పుత్తూరు

వృద్ధులకు మంచి ఆదరణ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలతో వృద్ధులకు మంచి ఆదరణ కలుగుతోంది. ఇలాంటి సేవ చేయిస్తున్న జగన్‌కు వచ్చే ఎన్నికల్లో కూడా అండగా ఉంటాం. –జయరామయ్య, పైమాఘం

జగన్‌కు రుణపడి ఉంటా..



సీఎం జగన్ నా బిడ్డలాగా ప్రతినెలా మా ఇంటికి డాక్టర్లను పంపి వైద్యం చేయిస్తున్నారు. జగన్‌ను ఎప్పటికీ మరచిపోను. ఎన్నికలు వస్తే ఆయనకే నా ఓటు వేస్తా. మళ్లీ మా ఊరికి డాక్టర్లను పంపిస్తాడు. వైద్యం చేయించుకొని ఆరోగ్యంగా తిరుగుతున్నాను.

–నాగరత్నమ్మ, టి.పుత్తూరు

జగన్‌కు రుణపడి ఉండాలి..



మా గ్రామానికి నెలకు ఒక సారి డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు చేస్తున్నారు. సీఎం జగనన్న వల్ల వైద్యం చేయించుకొంటున్నాను. మందులు, మాత్రలు నెలకు సరిపడే విధంగా ఇస్తున్నారు. జగనన్న వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పేదలందరూ రుణపడి ఉంటాం. –కవిత, టి.పుత్తూరు

జగన్‌తోనే ఇంటి ముంగిటకే వైద్య సేవలు:



జగన్ వల్ల వైద్యులు ఇంటికి వచ్చి వైద్యం అందిస్తున్నారు. వైద్యం కోసం తవణంపల్లె పీహెచ్‌సీకి వెళ్లేవాళ్లం. ప్రసుత్తం మా ఊరికి డాక్టర్లు వచ్చి పిలిపించి వైద్యపరీక్షలు చేస్తున్నారు. మందులు, మాత్రలు ఇస్తున్నారు. జగనన్న మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా.

–రేణుకమ్మ, పైమాఘం